❖•❖•❖ 58 ❖•❖•❖

# విశ్వాససహితమైన ప్రయాణం

*"అటుతరువాత యూదుల భయమువలన రహస్యముగా యేసు శిష్యుడైన అరిమతయియ యోసేపు, తాను యేసు దేహమును తీసికొనిపోవుటకు పిలాతునొద్ద సెలవడిగెను. పిలాతు సెలవిచ్చెను. గనుక అతడు వచ్చి యేసు దేహమును తీసికొనిపోయెను. మొదట రాత్రివేళ, ఆయన యొద్దకు వచ్చిన నీకొదేముకూడ బోళముతో కలిపిన అగరు రమారమి నూట ఏబది సేర్ల యెత్తు తెచ్చెను. అంతట వారు యేసు దేహమును ఎత్తికొనివచ్చి, యూదులు పాతిపెట్టు మర్యాద చొప్పున ఆ సుగంధద్రవ్యములు దానికి పూసి, నారబట్టలు చుట్టిరి" (యోహాను 19:38-40).*

నీకొదేము, అరిమతయియ యోసేపు వలెనే, యూదుల మహా సభలో ఒక సభ్యుడై యుండెను. ఈయన పేరు మత్తయిగాని, మార్కుగాని, లూకా గాని పేర్కొనలేదు, కానీ యోహాను తన సువార్తలో ముమ్మారు పేర్కొన్నాడు (యోహాను 3:1-15; 7:43-52;

19:38-42). యూదుల మహా సభ యేసు ఎలాగైనా సిలువవేయబడవలసినదే అని వారనుకున్న దానిని సాధించుటకు వేసిన కుటిలమైన కుట్ర యొక్క ప్రణాళికను మరియు చర్యకు యోసేపు సమ్మతించలేదని లూకా వ్రాశాడు (లూకా 23:50, 51); నీకొదేము గూర్చి కూడ అదే వ్యాఖ్యానము చేయబడి యుండవచ్చునని మనము అనుకొనుచున్నాము.

ఈ ఇద్దరు కూడా క్రీస్తు నందలి రహస్య విశ్వాసులయ్యారు, కానీ యేసు మరణించి సమాధిచేయబడునంత వరకు ఈ ఇద్దరిలో ఏ ఒక్కరైనను వారి విశ్వాసమును బహిరంగముగా వెల్లడించలేదు. ఈ ఇద్దరిలోనే ఏదో ఒక సమయంలో యేసునందు విశ్వాసం అంకురించిందనియు, ఒప్పుకుంటే ఇక్కట్టులు ఎదురౌతాయని తెలిసినను దానిని బాహాటంగా కనుపరచు సమయం వచ్చునంత వరకు ఆ విశ్వాసం నెమ్మదిగా అభివృద్ధిచెందుచూ బలపడినదనియు స్పష్టమగుచున్నది.

మనకు యోసేపు కంటే నీకొదేము గూర్చే ఎక్కువ సమాచారమున్నదను వాస్తవమునుబట్టి, మనము నీకొదేము విశ్వాస ప్రయాణములో అతనితో కూడ కొంచెము సమీపస్థంగా పయనించవచ్చును. కొంత మేరకు, ఇటువంటి విశ్వాస ప్రయాణాన్ని మనమందరము చేశాము లేదా చేస్తూ ఉన్నాము.

*మనము నీకొదేము తొలి పరిస్థితిని గమనించినట్లయితే* ఆయన అన్వేషణాసక్తిగల విశ్వాసము కలిగియున్నాడని చూడగలము. ఆయన యేసుతో ముఖాముఖిగా సంభాషించు తరుణం కొరకు వెదకుచున్నాడు. ఆయన యేసుతో మాట్లాడాలని ఏర్పాటుచేసినప్పుడు ఆయన యూదులకు ఒక అధికారిగా తన పరువుప్రతిష్టలు కోల్పోవుటకు అవకాశాలున్నాయని అనుకొన్నాడు. ఈ హేతువు చేతనే, ఆయన యేసు దగ్గరకు రాత్రివేళ రావాలని ఎన్నుకున్నాడు. ఆయన రహస్యంగా రాత్రివేళ వచ్చినప్పటికిని, ఆయన పరామర్శించు మనస్సు మరియు నిజాయితీ గల స్ఫూర్తితో వచ్చాడు. బహుశ యేసు బోధలు అంతకు మునుపే వినుటనుబట్టి యేసు యొక్క సందేశాన్ని మరియు సమక్షమును అర్థంచేసికోడానికి ఆయనలో ఒక కోరిక ఉద్భవించి యుంటుంది. తద్వారా యేసు బోధించుచుండిన బోధలలోను చేయుచుండిన పనులలోను గల యథార్థత యొక్క శ్రేష్ఠతను ఆయన గుర్తించాడు.

యోహాను నీకొదేమును గూర్చి ఇలా వ్రాస్తున్నాడు: "యూదుల అధికారియైన నీకొదేమను పరిసయ్యుడొకడుండెను. అతడు రాత్రియందు ఆయనయొద్దకు వచ్చి, 'బోధకుడా, నీవు దేవునియొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని' ఆయనతో చెప్పెను" (యోహాను 3:1, 2). యేసు చేసిన అద్భుతములు నీకొదేము కాదనలేకుండునట్లు అవి ఆయనకు విశ్వసనీయమైన అధికారిక పత్రములవలె ఉండినవి. గనుక యేసు గూర్చి యింకా ఎక్కువగా తెలిసికొనవలెనను కుతూహలముతో వాటిచేత ముందుకు నడిపింపబడ్డాడు. నీకొదేము మరియు యేసు మధ్య రాత్రివేళ జరిగిన సందర్భోచిత సంభాషణలో, యేసు ఆయనతో దేవుని రాజ్యము గూర్చి – దేవుని రాజ్యములో ప్రవేశించాల్సిన అవసరత, ఒకరు ఎలా ప్రవేశింపగలరు, దాని స్వభావమేంటి మొ॥ విషయాలు – సవిస్తరంగా చర్చించాడు. "నీకొదేము హృదయము నూరంతలుగా ఫలించిన మంచి నేలవంటిదని క్రీస్తు గమనించియుండును గనుకనే ఆ మంచి నేలలో మంచి మేలైన విత్తనములు అంత ఎక్కువగా వెదజల్లాడు."[1] ఆనాటి రాత్రి ఆయన విశ్వాసం యింకా ఎంతో ఎదిగి అభివృద్ధిచెందాల్సినదిగా ఉండిన ఆవగింజంత పెద్దదిగా

లేకపోయినప్పటికిని ఆయన హృదయం యేసును ఆప్యాయతతో ఆకర్షించుకొన్నది.

ఆయన మరలా జన్మించవలసియుండునని యేసు నీకొదేముతో చెప్పాడు: "ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను"; "ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:3, 5). నీకొదేము విశ్వాసము అతడు మరలా జన్మించు స్థాయికి వచ్చుసరికి కొంత సమయం పట్టును, కానీ, కనీసము – దానిలో దాగియున్న భావమునుబట్టి మనము చెప్పగలము – ఆ నాటి రాత్రి ఆయన వినిన బోధల ద్వారా, ఆయన విశ్వాసము దాని ప్రయాణమును పరిపూర్ణత దిశగా ప్రారంభించిందని చెప్పగలము.

*రెండవదిగా, అభివృద్ధిచెందుచున్న విశ్వాసమును మనము ఆయనలో చూడగలము.* ఆటుతరువాత, ఆయన యొక్క ఆధ్యాత్మిక అభివృద్ధిలో, యేసును మరియు ఆయన వాక్కును తృణీకరించవలెనని మహా సభ సభ్యులితరుల కుటిల పథకం ద్వారా ఆయన గ్రహించుచున్నాడు. యేసును పట్టుకొనుటలో విఫలులైనవారిని పరిసయ్యులు ఎగతాళి చేసినప్పుడు, నీకొదేము, నిస్సంశయంగా విశ్వాసంలో నుండి పుట్టిన సాహసంతో, "ఒక మనుష్యుని మాట వినకమునుపును, వాడు చేసినది తెలిసికొనక మునుపును, మన ధర్మశాస్త్రము అతనికి తీర్పుతీర్చునా?" అని అడిగాడు (యోహాను 7:51). అందుకు పరిసయ్యులు వెంటనే, "నీవును గలిలయుడవా? విచారించి చూడుము, గలిలయలో ఏ ప్రవక్తయు పుట్టడు" అని ఎదురు సవాలు విసిరారు (యోహాను 7:52). మనస్సును గాయపర్చు ఈ మాటలతో వాగ్వివాదం ముగిసిన తరువాత నీకొదేము ఏమీ మారుమాట్లాకుండా కనుమరుగైనట్లు కనిపించుచున్నది. సిలువకు దారితీసిన ఆ తరువాతి రోజుల్లో, యేసు క్రీస్తు దేవుని చేత పంపబడినవాడను సత్యము ఆయనపై కలిగియుండిన గంభీరమైన ప్రభావము గూర్చి ఆయన ఆలోచిస్తూనే ఉన్నాడని నమ్మట సహేతుకమైనదే. తీవ్రమైన వివాదము ఏర్పడినప్పుడు సహితం ఆయన విశ్వాసం ఎదుగుచుండినది.

*మూడవదిగా, నీకొదేము ప్రయోజనకరంగా పనికిసరిపడినదైయుండిన విశ్వాసము కలిగియుండెనని చూడగలము.* మొదటిసారి యేసు దగ్గరకు రాత్రివేళ వచ్చిన ఈయన ఇప్పుడు యేసు దేహం విషయంలో సహాయం చేయడానికి పట్టపగటివేళ బయటకు వచ్చుచున్నాడు. ఆయన విశ్వసించాడు ఇప్పుడు ఆ విశ్వాసం ప్రయోజనకరంగా పనికివచ్చునంతటి బలమైనదయ్యింది. యేసు పట్ల ఒకప్పుడు రహస్యమైనదై యుండిన విశ్వాసం ఇప్పుడు అనురాగసహితంగా సుకుమారమైనదై ఉద్రూతలూగించు విశ్వాసంగా వికసించింది.

యోహాను ఇలా వ్రాస్తున్నాడు: "మొదట రాత్రివేళ ఆయన యొద్దకు వచ్చిన నీకొదేము కూడ బోళముతో కలిపిన అగరు రమారమి నూట ఏబది సేర్ల యెత్తు తెచ్చెను. అంతట వారు యేసు దేహమును ఎత్తికొనివచ్చి, యూదులు పాతిపెట్టు మర్యాద చొప్పున ఆ సుగంధద్రవ్యములను దానికి పూసి నారబట్టలు చుట్టిరి" (యోహాను 19:39, 40). యేసు దేహమునకు పూయుటకు నీకొదేము బోళముతో కలిపిన అగరు తీసికొనిరాగా ఆ దేహమును పాతిపెట్టుటకు యోసేపు అనుమతి తెచ్చాడు. ఈ సుగంధద్రవ్యములు కుదింపుగా చుట్టబడినవై యుండవచ్చును లేదా సువాసనను వెదజల్లు పొడిగా నుండిన చూర్ణమై యుండవచ్చును. వారు వాటిని బాగా నలుగగొట్టి యేసు దేహమునకు చుట్టబడిన నారబట్ట మడతలలో అక్కడక్కడ

పోసారు లేదా ప్రోక్షించారు. ఎలా చేస్తేనేమి దేహమంతా సుగంధద్రవ్యముల మిశ్రమముతో పూయబడవలెననునదే ముఖ్యోద్దేశము. దేహమంతటికి పూయుటకు నూట ఏబది సేర్ల యెత్తున్న సుగంధద్రవ్యములు చాలినవైయుండును. ఈ పనంతా త్వరత్వరగా చేయబడింది. యేసు దేహము పాడవకుండా పరిమళద్రవ్యములలో పదిలపరచుటకు సాధ్యమవలేదు; వారికి మిగిలిన ఆ కొద్ది సమయం నారబట్టలో చుట్టుటకే సరిపోయినదై యుండినది. యోసేపు తెచ్చిన తెల్లని శుభ్రముగానుండి చుట్టబడియుండిన పొడవైన నారబట్ట యేసు దేహమంతటిని చుట్టి కప్పిన వస్త్రమయ్యింది. తెచ్చిన సుగంధద్రవ్యములను వారబట్టలోని మడతలలో ఎక్కువ మొత్తంలో పోసారు. ఈ నారబట్ట ముళ్లతో గాయపర్చబడియున్న తలను కప్పు టోపీవంటి ఆచ్ఛాదమైనది, లేదా తలకు పాగాగా మరొక నారబట్ట చుట్టబడింది.

ఒక సత్యం కొట్టవచ్చినట్లు కనబడుచున్నది: మృత దేహమును ముట్టుకొనుట ద్వారా ఏ యూదుడును తనను తాను అపవిత్రునిగా చేసికొనకుండుటకు తగు జాగ్రత్తలు వహించు సమయం (యోహాను 19:31). ఏదిఏమైనా, ఈ ఆలోచన, యూదుల మహా సభ సభ్యులై యుండి, గొప్ప పస్కా పండుగ ఆచరణను పాటించుటలో నాయకులై యుండవలెనని ఎదురుచూస్తూ ఉండిన, యోసేపునుగాని నీకొదేమునుగాని ఏమాత్రం తొందరపెట్టలేదు.

యోసేపు మరియు నీకొదేము వారి విశ్వాసమును ఇతరులకు తెలియజేయవలెనని ఎంతో కాలం వేచియుండిరి. ఏదిఏమైనా, వారి విశ్వాసమును వ్యక్తము చేసినట్లయితే యేసు మన నిమిత్తము భరించిన అపఖ్యాతిపాలుజేయు దూషణలే ఎదురయ్యే సమయంలో వారు వారి విశ్వాసమును ప్రదర్శించారు మరియు అందుకు తగిన చర్యను చేపట్టుటకు సాహసించారు. యేసుకు తోడ్పడవలెనని వారు వచ్చినప్పుడు, యేసుతో వీరి కంటె ఎక్కువ సన్నిహితముగా నుండిన శిష్యులు మరియు అపొస్తలుల ఈ సంకట సమయంలో కనుపర్చిన దాని కంటె ఎక్కువ విశ్వాసము మరియు ప్రేమతో వచ్చారు. యేసు యొక్క మానవ దేహమునకు ఇతర మానవులనుండి పొందుకొను లేదా అవసరమైయుండిన చివరి సేవలను చేయుటకు వారు వచ్చారు. యేసును ప్రేమించు ఎవరైనా యోసేపు మరియు నీకొదేము చేసిన కార్యములను ఆనందంతో అభినందిస్తారు, కరతాళధ్వనితో హర్షిస్తారు, మరియు నిండు మనస్సుతో శ్లాఘిస్తారు.

❖•❖•❖

*ఆయన జన్మము గౌరవింపబడుచుండిన సందర్భములో యేసునకు మొట్టమొదట తూర్పు దేశము నుండి వచ్చిన జ్ఞానుల చేత సాంబ్రాణి మరియు బోళము కానుకలుగా సమర్పింపబడినవి. మరియు ఇప్పుడు ఆయన మరణము గౌరవింపబడుచుండిన సందర్భములో ఆయనకు బోళము కలిపిన సుగంధద్రవ్యములు పూయబడినవి.*

*ఒకనాడు దాని మీద ఏ మనుష్యుడును ఎన్నడు కూర్చుండని గాడిదపిల్లనెక్కి (లూకా 19:30) వచ్చినవాడు ఇప్పుడు దానిలో ఎవడును అంతకు మును పెప్పుడును ఉంచబడని సమాధిలో పాతిపెట్టబడినాడు (లూకా 23:53).*

---

సూచన

[1]William Hanna, *Our Lord's Life on Earth* (London: Religious Tract Society, 1882), 574.